క్లుప్తంగా

అంజన్నకు అభిషేకం


అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శనీశ్వరస్వామికి పూజలు


పూజలందుకున్న శనీశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో ఉన్న శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా తవక్కల్‌షావలి ఉరుసు


దర్గాలో గంధం సమర్పించి ఫాతేహాలు పఠిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని హజరత్ సయ్యద్ తవక్కల్ షావలి దర్గా 245 ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తవక్కల్ షావలి సమాధికి గంధం సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు పఠించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు పీరా, రియాజ్, ఇక్బాల్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత


స్వాధీనం చేసుకున్న నాటు సారాను చూపుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

కూడేరు: మండలంలోని మరుట్ల–2వ కాలనీ వద్ద శనివారం ఎస్‌ఐ సత్యనారాయణ, తన సిబ్బందితో కలసి 30 లీటర్ల నాటు సారాని పట్టుకున్నారు. ఆత్మకూరు మండలం మదిగుబ్బ తండాకి చెందిన ఇద్దరు వ్యక్తులు పామిడి మండలం కోనేపల్లి తండా నుంచి ద్విచక్ర వాహనంలో 30 లీటర్ల నాటు సారాను బాటిళ్లలో తీసుకువెళ్తుండగా పోలీసులు కాపుకాచి పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ జమేదార్ వెంకటేశులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ


ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకురాలు పురందేశ్వరి

ఉరవకొండ: స్థానిక అనంతపురం–బళ్లారి జాతీయ రహదారి సమీపంలో కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో దగ్గుపాటి శ్రీరాములు, సౌభాగ్య, దగ్గుపాటి యుగంధర్, చంద్రమౌళి సౌజన్యంతో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహాన్ని శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం ఆమె పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర నాయకుడు చార్లెస్ చిరంజీవిరెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ కేశవనాయక్, ఈటీ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- ఎంపీ తలారి రంగయ్య
- గ్రామాల్లో సమన్వయకర్తకు ఘన స్వాగతం


కుందుర్పి మండలం ఎనుములదొడ్డిలో మాట్లాడుతున్న సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సూచించారు. శనివారం మండలంలోని ఎనుములదొడ్డి, తెనగల్లు, కరిగానిపల్లి పంచాయతీల్లో ప్రజలు, కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం రుద్రంపల్లిలో సమన్వయకర్తకు ప్రజలు మేళతాళాలు, తప్పెట్లు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. గురువేపల్లి, ఎనుములదొడ్డి, తెనగల్లు, కరిగానిపల్లి, ఎస్.మల్లాపురం, గురువేపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యలించారు. ఎనుములదొడ్డిలో ఇటీవల మృతి చెందిన వైస్ ఎంపీపీ బీజప్ప ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో ఎన్నికలున్నాయని, వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, వైస్ ఎంపీపీ భీమిరెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఈ.రాము సర్పంచులు మహదేవమ్మ, మారుతేశ్వరి, వరలక్ష్మి, గంగాధర, ప్రభాకర్, బొమ్మయ్య, ఎంపీటీసీ గంగమ్మ, కురుబ సంఘం అధ్యక్షుడు మర్చంట్ గోపాల్, నాయకులు లక్ష్మణమూర్తి, దొణస్వామి, పుజారి భీమప్ప, మందలపల్లి భీమప్ప, బొమ్మలింగ, ఎంహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గరుడపురంలో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న హనుమప్ప కుటుంబాన్ని శనివారం ప్రభుత్వాస్పత్రిలో ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, చాపిరి సొసైటీ చైర్మన్ వెంకటేశులు, కురుబ సంఘ తాలుకా అధ్యక్షుడు దొణస్వామి, గోళ్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కంబదూరు: మండలంలోని కురాకులపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొల్ల శ్రీనివాసులు (35) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ తలారి రంగయ్య శనివారం ఆ గ్రామానికి వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర జనపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వాల్మీకి సేవా సంఘం తాలుకా అధ్యక్షుడు ములుకునూరు గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు గోళ్ల సూరి, దోణస్వామి, జిల్లా కమిటీ సభ్యులు శంకరప్ప,బొమ్మయ్య తదితరులు పాలొన్నారు.


కంబదూరు మండలం కురాకులపల్లిలో శ్రీనివాసులు మృతదేహనికి నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య

నేడు ఎంపీ పర్యటన

కళ్యాణదుర్గం: అనంతపురం ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆదివారం కుందుర్పి మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు కృష్టాపురం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తూముకుంట, బెస్తరపల్లి, మహంతపురం గ్రామాల్లో పర్యటన సాగుతుందన్నారు. పార్టీ మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో శనివారం లేపాక్షి నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి మొత్తం 365 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా 54 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ పరిశీలించారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. రెండు సెంటర్లలో కలపి పరీక్షలకు మొత్తం 301 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

రాయదుర్గం ఎన్నికల పరిశీలకుల నియామకం

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాయదుర్గం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా ఏడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ లిఖితతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు పామిడి వీరాంజనేయులును నియమిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డితో కలసి ఇన్‌చార్జ్ మంత్రి మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గ పరిశీలకులుగా వారు వ్యవహరిస్తారన్నారు. పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకుని రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరేయాలన్నారు.


ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పామిడి వీరాంజనేయులును అభినందిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, రాయదుర్గం నాయకులు పాల్గొన్నారు.

మందుల పిచికారీకి సబ్సిడీతో డ్రోన్లు

కుందుర్పి: వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం పంటలకు మందుల పిచికారీ చేయడానికి సబ్సిడీతో డ్రోన్లను అందిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. శనివారం బెస్తరపల్లి, మహంతపురం పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.5 లక్షల సబ్సిడీతో మందుల పిచికారీ డ్రోన్లను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. రూ.10 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను రూ.5 లక్షల సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు. ఈసందర్భంగా బెస్తరపల్లి రైతు హనుమేష్ పొలంలో డ్రోన్ వాడకంపై రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు.


డ్రోన్ల ద్వారా మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

25న అశ్వత్థంలో వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం తిరునాల సందర్భంగా టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 25న వేలం జరగనుంది. ఈ మేరకు ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లె శ్రీనివాసులు రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.


ప్రతిభ వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'


రాయదుర్గంటౌన్: మండల స్థాయి విజేతలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: క్రీడాకారుల ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం మండల స్థాయి పోటీలు ముగిశాయి. దాదాపు 141 మ్యాచ్‌లు జరగా కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బాల్ బాడ్మింటన్‌లో ఐదు జట్లు నియోజకవర్గ స్థాయికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలసి ఆయన క్రీడాకారులకు కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఈ నెల 24 నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఆరవా శివప్ప, కౌన్సిలర్లు శారదమ్మ, గౌని లావణ్య, కోఆప్షన్‌సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లకెర వీరభద్రారెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, గౌని శ్రీరామిరెడ్డి, క్రీడల కోఆర్డినేటర్ ఇస్మాయిల్, పీడీలు జయప్ప, రామాంజనేయులు, మల్లికార్జున, సుధాకర్, కరెప్ప, నాగేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. బాలుర క్రికెట్‌లో ముద్దినాయనపల్లికి జట్టు, బాలికల క్రికెట్ విభాగంలో కళ్యాణదుర్గంలోని వడ్డేకాలనీకి చెందిన జట్టు నియోజకవర్గం స్థాయి ఎంపికైంది. అలాగే వాలీబాల్ విభాగంలో వడ్డే కాలనీ జట్టు, కొత్తూరు జట్టు, షటిల్‌లో మారంపల్లి జట్టు , ఇందిరమ్మ కాలనీ జట్టు, కబడీ విభాగంలో పట్టణంలోని కమ్మనుచెట్టు వీధి జట్టు , వడ్డే కాలనీ జట్టు నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యాయి. విజయం సాధించిన జట్లుకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం కోర్డినేటర్ చల్లా కిరణ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాజీ, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ అశ్వర్థనారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన జట్ల కెప్టెన్లకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ దాసానాయక్ జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ నందకిశోర్, పంచాయతీ కార్యదర్శులు కవిత, మురళి పీఈటీ ఇబ్రహీం, క్రీడాకారులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం రూరల్: ముద్దినాయనపల్లి జట్టుకు క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న దృశ్యం


బహ్మసముద్రం: క్రీడాకారులను సన్మానిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


గడేహోతురులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

వజ్రకరూరు: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో రబీ సీజన్‌లో చేపట్టిన ఈ-పంట నమోదును సూపర్‌చెక్‌లో భాగంగా తనిఖీ చేశారు. చిన్నహోతురులోని రైతు చెన్నప్ప, గడేహోతురులో రైతులు సత్యనారాయణ, శ్యామల పొలాల్లో పప్పుశనగ పంటను ఆమె పరిశీలించారు. డీఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు పంట నమోదును పక్కాగా నిర్వహిస్తోందన్నారు.ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందించడంతోపాటు సకాలంలో విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఏ పద్మాజ, టెక్నికల్ ఏఓ బాలునాయక్, ఏఓ మధుకర్, ఆర్‌బీకే ఇన్‌చార్జులు ఇందు, శరణ్య, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా.. రూ.5.77 కోట్లు


మాట్లాడుతున్న ఏసీ మద్దిలేటి

కూడేరు: వైఎస్సార్ ఆసరా పథకం కింద మండలంలో నాలుగో విడతలో 723 స్వయం సహాయక సంఘాలకు చెందిన 7146 మంది మహిళల ఖాతాల్లోకి రూ.5.77 కోట్లు జమవుతుందని వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్(ఏసీ) మద్దిలేటి తెలిపారు. శనివారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వైఎస్సార్ లబ్ధిపై వీఓఏలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాలుగు విడతల్లో 7146 మందికి ప్రభుత్వం మొత్తం రూ.23.8 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. నాలుగో విడత సొమ్మును ఈ నెల 23 ఉరవకొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. కార్యక్రమానికి సంఘ సభ్యులంతా తరలిరావాలని ఆయన సూచించారు. విజేత సమాఖ్య మండల అధ్యక్షురాలు వసంత, ఏపీఎం రాజశేఖర్, సీసీలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కూడేరు: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం అనంతపురానికి చెందిన శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. నిపుణులు హాజరై వైద్య చికిత్సలు అందజేస్తారన్నారు. మండలవాసులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి


ఉరవకొండ: మాట్లాడుతున్న చేనేత విభాగం నాయకులు


విడపనకల్లులో మాట్లాడుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

ఉరవకొండ: సీఎం పర్యటన విజయవంతం చేయాలని చేనేత సంఘం నాయకలు కోరారు. శనివారం ఉరవకొండ పట్టణలో చేనేత విభాగం రాష్ట్ర నాయకులు చందా చంద్రమ్మ, మిడతల చంద్రమౌళి, ఎంసీ నాగభూషణం, చెంగల మహేష్, గట్టు ఎర్రిస్వామి, సాధు కుళ్లాయిస్వామి, కొత్తపల్లి హరి, కాసుల ఆంజినేయప్రసాద్, నిమ్మల వెంకటరమణ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత ఆసరా సొమ్ము విడుదల చేయడానికి ఈ నెల 23న ఉరవకొండకు వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనకు ఘనంగా స్వాగతం పలకుతూ చేనేతలు పెద్దఎత్తున నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకులు బీరేశివ, సుదర్శన్, ఆరెరాజ, బాలాజీ, పుల్లా ఆంజినేయులు,రామకృష్ణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి కోరారు. స్థానిక స్త్రీ శక్తి భవనం లో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 23న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా' నిధులు విడుదల చేసేందుకు ఉరవకొండకు వస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'దుర్గం'ను రోల్‌మోడల్‌గా తయారుచేద్దాం


శాంతినగర్‌లో టీకొట్టు వద్ద యువకులతో మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తయారుచేసేందుకు ప్రజలంతా కలసి రావాలంటూ ఏపీఐఐసీ చైర్మన్, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలో పర్యటించారు. శాంతినగర్‌లోని ఓ టీ కొట్టు వద్ద టీ తాగుతూ యువకులతో మాట్లాడారు. మంచిచేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల సంగ్రామం దగ్గరపడుతోందని, ప్రతి ఒక్కరి మదిలోనూ జగన్, ఫ్యాన్ అనే రెండు మాటలు గుర్తిండి పోవాలన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలు, దోపిడీ, మోసం, దగా రాజకీయాలు రాయదుర్గం ప్రజలకు వద్దన్నారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నంత వరకే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని గుర్తుచేశారు. కల్లిబొల్లి మాటలు చెప్పి మోసం చేసే టీడీపీ నాయకులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నాయకుడు పొరాళ్ల శివ, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, కౌన్సిలర్లు కొంతెం దేవరాజు, శ్రీనివాసరెడ్డి, షబ్బీర్, తట్టే మంజు, కో–ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, కడ్డిపుడి నజీర్, దివాకర్, బషీర్, నిజామ్, గోరంట్ల సత్యనారాయణ, రాము, తాళ్లకెర వీరభద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కులగణన ప్రారంభం


శెట్టూరులో కులగణన చేస్తున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ నాగరాజు, వలంటీర్లు

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. వలంటీర్లతో కలసి ప్రతి ఇంటికీ వివరాలు సేకరిస్తూ గణన చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో బాధ్యతతో అప్పగించిన పనికి న్యాయం చేస్తామని పలువురు సచివాలయ ఉద్యోగులు చెప్పారు.


కూడేరు మండలం బ్రాహ్మణపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి

కూడేరు: మండలంలో కుల గణన సర్వే చురుగ్గా సాగుతోంది. శనివారం బ్రాహ్మణపల్లిలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ నాగభూషణరెడ్డి తనిఖీ చేశారు. సర్వేకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్, రఘు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ భవనానికి రూ.5 లక్షల కేటాయింపు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఉపాధ్యాయ భవన నిర్మాణానికి ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త తలారి రంగయ్య ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు కలసి ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇచ్చిన మాట మేరకు నిధులను కేటాయించి తమపై గౌరవాన్ని చూపినందుకు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోవుల షెడ్లకు ఆర్థిక సాయం

కణేకల్లు: గోవుల షెడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం చేయనుందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సుధాకర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు ఆవులు కలిగి ఉంటే రూ.80 వేలు, మూడు ఆవులుంటే రూ.1.20 లక్షలు, ఆరు ఆవులుంటే షెడ్ల నిర్మాణం కోసం రూ.2 లక్షలు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందన్నారు. షెడ్ల మంజూరు కోసం వెటర్నరీ డాక్టర్ ద్వారా ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుందన్నారు. అలాగే డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 100 శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మూడేళ్లపాటు నీరు, సంరక్షణ ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.